# శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - ఉక్కునగరం, కార్యాచరణ నివేదిక

"నలుగురు ఒక్కచోట చేరి నా చరిత్ర పారాయణ చేసేవారు ఇహపరాల గురించి ఆలోచించాల్సిన అవసరంలేదు" అన్న శ్రీ గురుడి అభయాన్ని అనుసరించి విశాఖపట్నం ఉక్కునగరంలో సత్సంగాల రూపేన ప్రారంభమయిన కార్యక్రమములు క్రమేపీ వృద్ధి చెందుతూ మహాత్ముల, అవధూతల, జన్మదినాలు, ఆరాధనోత్సవాల పేరిట, ఆధ్యాత్మిక భావాలను నలుగురితో పంచుకుంటూ, అన్నదానాలు, వస్త్రదానాల రూపేణ సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ, వేలాది మందికి పారాయణ గ్రంధాలు అందించటము ద్వారా, వారి హృదయాలలోనుంచి వచ్చిన భావాల ప్రతిరూపముగా మందిర నిర్మాణము చేపట్టిన వారికి తగిన సూచనలు సలహాలు ఇవ్వటమేకాక, అనేక మందిర నిర్మాణాలలో ప్రత్యక్ష, పరోక్షముగాన సహకరించటము జరుగుచున్నది.

**1. ఆధ్యాత్మిక కార్యక్రమాలు :** విశాఖ ఉక్కునగరాన్నిదాటి, విజయనగరం, శ్రీకాకుళం, ఖమ్మం, గుంటూరు, తూర్పుగోదావరి మొదలైన జిల్లాలలో ఆధ్యాత్మిక గాలి ఏమాత్రం సోకని మారుమూల గ్రామాలలో సాయిని పరిచయంచేస్తూ సత్సంగాలు నిర్వహించడం ద్వారా నేడు వేలాదిమందికి మాస్టారు చూపిన ఉత్తమమైన సాయిమార్గంలో ప్రయాణం చేయటానికి తనవంతు కృషి చేస్తున్నది ట్రస్టు. గిరిజన ప్రాంతాలలో సాయి దీక్షలు పేరిట బాబా ఫోటోలు, వస్త్రాలు, పారాయణ పుస్తకాలు మొదలైన ఉచితముగా అందించటము ద్వారా, వారిలోని మానసిక భయాందోళనలు తగ్గి, నైతిక విలువలు పెరిగి, దుర్వ్యసనాలు మాని క్రమబద్ధమైన జీవితానికి అలవాటు పడటానికి శ్రీ శిరిడీసాయి ట్రస్టు ఇతోదికంగా తన సహాయ సహకారాలు అందిస్తున్నది.

**2. విద్యా, సేవా కార్యక్రమాలు :** నేటి విద్యార్థులను ప్రోత్సహిస్తూ రేపటి మంచి పౌరులుగా తయారు చేసి తద్వారా సంఘానికి, దేశానికి ఉత్తమ సేవకులుగా తయారవ్వాలనే ఉద్దేశ్యముతో మారుమూల గ్రామాలలో అనేక కారణాలవల్ల కాలేజి చదువు మానేస్తున్న పేదవిద్యార్థినీ, విద్యార్థులను ఎంపికచేసి వారి భావి జీవితానికి తన వంతు చేయూత నందిస్తున్నది. నేడు సుమారు 300 మంది పేద విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఫీజులు, బట్టలు పంపిణీ చేయటము జరుగుతున్నది. ప్రాథమిక స్థాయిని నుంచి కూడ విద్యను ప్రోత్సహించాలని పల్లెల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించటమేకాక, ఉచితముగా విద్యా సామగ్రి కూడా అందించటము జరుగుతున్నది.

**3. సామాజిక సేవా కార్యక్రమాలు :** నిరుపేదలైనవారికి దుప్పట్లు, వంటసామగ్రి, వస్త్రాలు, జీవనోపాధికి అవసరమైన కుట్టుమిషన్లు, పుట్టి నడిపేవారికి పడవ కొనుగోలుకు ఆర్థిక సహాయం, అంధులకు అవసరమైన చేతికర్రలు మొదలైనవి అందిస్తూ వారికి ఉడతాభక్తిగా చేయూతనందిస్తున్నది ట్రస్టు.

**4. వైద్య సేవా కార్యక్రమాలు :** మానవ సేవయే మాధవ సేవగా, ట్రస్టు ఆధ్వర్యములో నిరుపేదలైన గిరిజన, హరిజన పేదవారికి ఉచిత ఆరోగ్య వైద్య, కంటి శస్త్ర చికిత్స శిబిరాలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు మొదలైనవి అందించడం జరుగుచున్నది. మూగ జీవాలను పరిరక్షించుటలో భాగంగా, ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా గ్రామాలలో పశువులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నవారికి తనవంతు సహాయ సహకారములు అందిస్తున్నది ట్రస్టు.

**5. ఆధ్యాత్మిక ప్రచార సేవా కార్యక్రమాలు :** "సాయి తత్వ ప్రచారమే సాయి సేవ" అని చెప్పిన శ్రీ భరద్వాజ గారి అడుగుజాడల్లో శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ ద్వారా "శ్రీ భరద్వాజ సద్గురువాణి" త్రైమాసిక పత్రిక స్థాపించి నిర్దుష్టమైన సాయితత్వ ప్రచార యజ్ఞాన్ని ఆంధ్రదేశం యావత్తు అందించడం జరుగుచున్నది. సద్గురువాణి ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక పాఠకులు గల పత్రికగా విరాజిల్లుతున్నది. విదేశాలలోని భక్తులకొరకు వెబ్‌సైట్ ప్రారంభించడం జరిగింది. పబ్లికేషన్స్ ద్వారా ఆధ్యాత్మిక - సామాజిక సేవా భావాన్ని పెంపొందించేవిధంగా కరపత్రాలు, పుస్తకాలు ప్రచురిస్తూ ఉచితంగా పంపిణీ చేయడం జరుగుచున్నది.

**6. నిర్మాణ కార్యక్రమాలు :** హృదయాలు మందిరాలుగా మారిన వారి హృదయలోతులలోంచి వచ్చిన ఆలోచనకు ప్రతిరూపముగా సాయి మందిర నిర్మాణాలు పూనుకోవటం జరుగుతున్నది. అంతేకాక ట్రస్టు సూచనలను అనుసరించి అనేక గ్రామాలలో అక్కడి ప్రజల సహకారముతో సాయి మందిరాల నిర్మాణము జరుగుతున్నది. నిర్మితమైన మందిరాల నిర్వాహకుల కోరికపై వారికి నిర్మాణాత్మకమైన మందిర నిర్వహణ సూచనలు అందజేయటము జరుగుతున్నది. నేడు అనేక మారుమూల గ్రామాలలో సత్సంగ మందిరాలు ప్రారంభించటమే కాక మందిరానికి అవసరమైన నిలువెత్తు చిత్రపటాలు, పూజా సామగ్రి, భజన సామగ్రి, పారాయణ పుస్తకాలతో పాటు సత్సంగ మందిరాలకు మైకుసెట్లు మొదలైనవి ఉచితంగా అందించడం జరుగుతున్నది.

**7. దృశ్య శ్రవణ ప్రచారము :** శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు ఆశయాలకు అనుగుణంగా శ్రీ కె. కరుణారెడ్డి, మిత్రబృందము అందించిన ఎల్.సి.డి. ప్రొజక్టరు ద్వారా మారుమూల గ్రామాలలో ఆధ్యాత్మిక, నైతిక విలువలతో కూడిన చిత్రాలతో పాటు శిరిడీ మొదలైన క్షేత్ర సందర్శనము చిత్రాలు కూడ ప్రదర్శించటము జరుగుతున్నది. సహృదయుల సహకారంతో నిరుపేదలై, నిజమైన ఆర్తికలిగిన సాయి భక్తులకు శిరిడీ, దత్త క్షేత్ర సందర్శనము ప్రత్యక్షముగా చేయించాలని సంకల్పించటము జరిగింది.

రాబోయే కాలంలో శ్రీ శిరిడి సాయి సేవా ట్రస్టు తన సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృత పరచుకుంటూ ఇంకా ఎక్కువమందికి చేరువవుతూ, చేయూతనివ్వాలనే సంకల్పం కలిగింది. ఈ ప్రజాహిత, ఆధ్యాత్మిక, జ్ఞాన, విజ్ఞాన సేవా కార్యక్రమాలలో మరింతమందిని భాగస్వాములను చేసుకొని వారి సేవలనుకూడా అందరికి అందించేవిధంగా ఒక నిర్దుష్ట ప్రణాళికతో ట్రస్టు సమాయిత్తమయ్యి ముందుకు సాగుతున్నది. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వాములవ్వాలని ఆకాంక్షించే ప్రతి ఒక్కరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము. గత 15 సంవత్సరాల నుండి సేవలనందించే మానసిక, శారీరక, ఆర్థిక శక్తిని అందజేసిన సాయిమాస్టర్‌కు, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి వందనాలు అర్పించుతూ, అందరమూ కలసి మరింతముందుకు మాస్టర్ చూపిన సాయి మార్గంలో పయనించాలని, అందుకు మీ సహాయ సహకారాలు నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ...

నూతన సంవత్సర శుభాకాంక్షలతో..

**వి.వి. పూర్ణచంద్రరావు**

ఫౌండర్ ఛైర్మన్, **శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్టు** (రిజిష్టర్డు)